క్లుప్తంగా

శ్రావణ నక్షత్ర పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఆదోనిఅర్బన్: శ్రావణ నక్షత్రం సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామివారికి మంగళవారం భక్తబృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి నవకలశ స్థాపన, విశ్వక్సేన పూజలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

ముగిసిన మండల దీక్ష పూజలు


ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆదోనిఅర్బన్: శ్రావణ మాసం సందర్భంగా 41 రోజులపాటు చేపట్టిన రణమండల ఆంజనేయ స్వామి దీక్ష మంగళవారంతో ముగిసింది.ఈ మేరకు వేకువజామున ఆలయ నిర్వాహకుడు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, వడలహారం, తులసీహారం, ఆకు పూజ, ప్రత్యేక పూల అలంకరణ, నైవేద్యం తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అనంతరం పల్లకీసేవ, రథోత్సవం కార్యక్రమాలు జరిగాయి.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప కోరారు. మంగళవారం అంగన్‌వాడీ ప్రాంతీయ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలారి అరెస్టుకు నిరసనగా ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ హెల్పర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యుటీ, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అఖండ, నాయకులు పవన్, సునీల్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆవుదొడ్డి వంకలో పూడికతీత


పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని ప్రధాన మురుగు కాలువ ఆవుదొడ్డి వంకలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పరిశీలించారు. కాలువలో పూడిక మొత్తాన్ని ఎత్తివేయాలని, అక్కడక్కడ ఎగుడుదిగుడుగా కుప్పలు ఉంచవద్దని, శుభ్రంగా తొలగించాలని శానిటేషన్ సెక్షన్ అధికారులకు సూచించారు. మేదర్ మసీదు ప్రాంతంలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. అనంతరం మరాఠీగేరిలో జరుగుతున్న సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్లు, కాలువలు నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఎంఐజీ వాటర్ ట్యాంకు వద్ద మస్టర్ పాయింట్‌ను పరిశీలించారు. నీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

శౌర్య యాత్ర జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కౌతాళం: విశ్వ హిందూ పరిషత్‌ను (వీహెచ్‌పీ) స్థాపించి 60 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా హిందూ సంస్కృతి సంప్రదాయాలను ప్రజలకు తెలిపేందుకు ఈ నెల 30 నుంచి అక్టోబరు 14వ తేదీ వరకు నిర్వహించనున్న శౌర్య జాగరణ యాత్రలో హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని ఆ సంఘం కౌతాళం ప్రఖండ అధ్యక్షుడు మారుతి మోహన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కౌతాళంలో మంగళవారం యాత్రకు సంబంధించిన కరపత్రాలను సంఘం సభ్యులతో కలసి విడుదల చేశారు. వీహెచ్‌పీ సభ్యులు చంద్రశేఖర్, నరేష్, భీమరెడ్డి, హనుమంతరెడ్డి, భజరంగదళ్ సంయోజక్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష'తో ప్రజారోగ్యానికి భరోసా


ఆదోని 26వ వార్డులో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న హెల్త్ సిబ్బంది


ఆదోనిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎఎన్‌ఎం, అశావర్కర్లు

ఆదోనిటౌన్: దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించడంతో ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి పట్టణాలు, పల్లెల్లో చురుగ్గా ఆరోగ్య సర్వే సాగుతోంది. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబసభ్యులకు ఆరోగ్య పరీక్షలు షుగర్, బీపీ, జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, ఆర్‌పీఎస్, యూరిన్ తదితర ఏడు రకాల పరీక్షలు చేస్తూ నివేదికను వైద్య సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారందరికీ వైద్య సేవలు అందించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఆరోగ్య సర్వేలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొంటున్నారు. ఆరోగ్యం బృందం ఇళ్ల వద్దకే వెళ్లి పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తుండడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

సురక్ష సర్వేలో జీఎన్‌ఎం విద్యార్థులు

ఆదోని సెంట్రల్: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమంలో జనరల్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొంటున్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్, హెచ్‌బీ వంటి పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణను బట్టి ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించే వైద్య శిబిరాలలో చికిత్స పొందాలని సూచిస్తూ టోకెన్లు అందిస్తున్నారు. ఆదోని పట్టణంలో 46 వార్డులు ఉండగా వార్డుకు ఇద్దరు చొప్పున 92 మంది నర్సింగ్ విద్యార్థుల సేవలను ఆరోగ్య సురక్ష సర్వేలో ఉపయోగించుకుంటున్నారు.

ఉచితంగా షుగర్ పరీక్షలు చేశారు



షుగర్ జబ్బుతో కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నాను. 15–30 రోజులకోసారి ఆదోనికి వెళ్లి చెకప్ చేయించుకుంటాను. అయితే ప్రభుత్వం మాలాంటి పేదల కోసం ఆరోగ్య బృందాన్ని ఇళ్ల వద్దకే పంపి ఉచితంగా పరీక్షలు చేయిస్తోంది. షుగర్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బంది వివరిస్తున్నారు. 30వ తేదీ నుంచి మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు.

– బసవరాజు, ఆదోని

వైద్య సేవలపై అవగాహన



ఆరోగ్యం పట్ల సరైన అవగాహన లేక ఎంతోమంది వివిధ సమస్యలతో బాధపడుతున్నా రు. అలాంటి వారిని గుర్తించి సంపూర్ణ ఆరోగ్యం కల్పించాల నే లక్ష్యంతో ప్రభుత్వం జగన న్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ప్రభుత్వం చేపడుతున్న ఈ మంచి కార్యక్రమంలో మేము భాగస్వాములై పాలు పంచుకోవడం సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేయడం, చికిత్సను దగ్గరుండి పర్యవేక్షించడం ద్వారా వైద్య సేవలపై అవగాహన ఏర్పడుతుంది.

– కె.శృతి, నర్సింగ్ విద్యార్థిని, ఆదోని

జీఎన్‌ఎం విద్యార్థుల సహకారం

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఏఎన్‌ఎంలకు సహాయకులుగా వార్డుకు ఇద్దరు చొప్పున నర్సింగ్ విద్యార్థులను కేటాయించారు. సర్వేపై వారికి మెలకువలు నేర్పించాం. దీంతో విద్యార్థులకు వైద్య సేవలపై అవగాహన కలుగుతుంది. పట్టణంలోని ప్రతి ఇంటిని సందర్శించి వైద్య సేవలను అందించడానికి అశావర్కర్లుతో పాటు నర్సింగ్ స్టూడెంట్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నారు.

– రవళి, మెడికల్ అధికారి

ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు


సజ్జలగుడ్డంలో వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం, పర్యవేక్షిస్తున్న డాక్టర్ మనోజ్‌కుమార్


పెద్దకడబూరులో బీపీ పరీక్షిస్తున్న దృశ్యం

కోసిగి: ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష ధ్యేయమని కోసిగి పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కోసిగిలోని 2, 3, 5వ సచివాలయాల పరిధిలోని సజ్జలగుడ్డం, జుమ్మాలదిన్నె, డి.బెళగల్, పెద్దభూంపల్లి, పల్లెపాడు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో హెల్త్ సూపర్ వైజర్స్, పీహెచ్‌ఎన్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌కుమార్ సజ్జలగుడ్డం, పల్లెపాడు గ్రామాల్లో ఆయన పర్యటించి ఆరోగ్య సర్వేను పర్యవేక్షించారు. స్వల్పంగా జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి అవసరం మేరకు మందులు అందించారు. 30 నుంచి నిర్వహించే వైద్య శిబిరాలలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు, మందులు అదిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌ఎన్ కోటేశ్వరమ్మ, సూపర్ వైజర్స్ ఎల్లప్ప, రాముడు, ఏఎన్‌ఎం సుజాత, వెంకలమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే గడప గడపలో సాగుతుంది. ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ఇంటింటికీ తిరిగి కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగరు వంటి పరీక్షలను నిర్వహించి వారి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకున్నారు. గతంలో వచ్చిన జ్వరాలు, జబ్బులు వాటి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించే శిబిరాలలో మెరుగైన వైద్య సేవలు, సరైన మందులు పొందాలని సూచించారు.

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వం ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని, ప్రజలు ఉపయోగించుకోవాలని కౌతాళం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యధికారి మనోజ్, బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఇమ్మానియేల్ కోరారు. మంగళవారం ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. మండలంలో 90 శాతం ఇళ్లలో సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. వైద్య సిబ్బంది సేకరించిన వివరాలతో 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. ఇందుకోసం టోకెన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


తోవిలో వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆరోగ్య సర్వే పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను ఈ నెల 29వ తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రమేశ్వర రెడ్డి, వైద్యాధికారులు మనోజ్, ఇమ్మాన్యుయల్‌లో కలిసి సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వలంటీర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతిఒక్కరి ఆరోగ్య వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఇంటింటి సర్వేను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యదర్శులు, వీఆర్వోలు, పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాల సంబరాలు


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కోసిగి బుడగ జంగాల కులస్తులు

కోసిగి: బేడ బుడగ జంగాలను ఎస్సీలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడంపై మండలంలోని ఆ వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కోసిగిలో ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు బుడగ జంగాల అయ్యప్ప ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేడ బుడగ జంగాల కులస్తులు ఊరు వాడ తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారని, ఇన్నాళ్లు కనీసం కుల ధ్రువీకరణ పత్రం లేక పిల్లలను చదివించుకోలేక, సంక్షేమ పథకాలు అందక దర్భర జీవితం గడుపుతున్నట్లు వివరించారు. తమ సమస్యలను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎస్సీ జాబితాలో చేర్చుతూ తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి పంపడంపై కృతజ్ఞతలు తెలిపారు. బుడజంగాల సంఘం మండల నాయకులు పెద్ద మారెప్ప, వీరేష్, శ్రీను, బద్రి, నరసయ్య, నడిపి మారెప్ప, ఎల్లప్ప పాల్గొన్నారు.

మార్కెట్‌కు భారీగా పత్తి దిగుబడులు


ఆదోని మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం రైతులు భారీ స్థాయిలో పత్తి దిగుబడులను అమ్మకానికి తీసుకొచ్చారు. వేరుశనగ, పూల విత్తనాలు, పత్తి దిగుబడుల టర్నోవర్ రూ.50 లక్షలు దాటిన ప్రతిఒక్క కమీషన్ ఏజెంట్ వ్యాపారస్థులకు టీడీఎస్ కోసం సెక్షన్ 194క్యూ కింద పాన్‌కార్డును ఇవ్వాలని ప్రచారం జరుగుతోంది. అందుకు కమీషన్ ఏజెంట్లు ససేమిరా అనడంతో వ్యాపారస్థులు బుధవారం నుంచి బంద్ పాటించా లని నిర్ణయించుకుని యార్డు సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు యార్డులో బుధవారం నుంచి బంద్ తీవ్రస్థాయిలో జరగనుందని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో రైతులు మంగళవారం రోజున అధిక సంఖ్యలో దిగుబడులను యార్డుకు అమ్మకానికి తరలించారు. సెక్రటరీ, కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్, వ్యాపారస్థుల అసోసి యేషన్ వారు యార్డులో సమావేశమై చర్చలు జరపడంతో పాన్‌కార్డును వ్యాపారస్థులకు ఇచ్చేందుకు కమీషన్ ఏజెంట్లు ఒప్పుకున్నారు. బుధవారం నుంచి యార్డు బంద్ లేకుండా యదావిధిగా కొనసాగనుంది. ఈ మేరకు మంగళవారం మార్కెట్‌కు 7,569 క్వింటాళ్ల పత్తి దిగుబడులు రాగా గరిష్ట ధర రూ.7,508, మధ్య ధర రూ.7,269, కనిష్ట ధర రూ.4,889గా నమోదైంది. యార్డులో వేరుశనగ క్రయ, విక్రయాలు జరగడం లేదు.వ్యాపారస్థులు యార్డులో కొనుగోలు చేసిన వేరుశనగను ఫ్యాక్టరీలకు తరలించగా అక్కడి హమాలీలు కూలి రేట్లు పెంచాలని ధర్నా చేపట్టారు. గత శనివారం నుంచి బంద్ కొనసాగుతూనే ఉంది. దీంతో నాలుగు రోజులైనా యార్డుకు వేరుశనగ రాలేదు. మొత్తం దిగుబడులు ఎమ్మిగనూరు మార్కెట్‌కు తరలివెళ్తున్నట్లు రైతులు, కమీషన్ ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యాపారస్తులు హమాలీల కూలి ధరల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి


సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

ఆదోనిరూరల్: కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, పంట నష్ట పరిహారం తక్షణమే మంజూరు చేయాలని, రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ మైదానం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎకరానికి పత్తికి రూ.50 వేలు, కంది, వేరుశనగ, జొన్న, టమాటా పంటలకు రూ.30 వేలు, ఉల్లి, మిర్చి పంటలకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని, ఖరీఫ్‌లో తీసుకున్న పంట రుణాలను రద్దు చేయాలన్నారు. వందశాతం ఇన్సూరెన్స్ వర్తింపజేసి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవాలన్నారు. రబీకి 90 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని కోరారు. జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి, వలసలను నివారించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావిరాజు, రైతు ఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు నరసప్ప, యల్లప్ప, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, పట్టణ, మండల సహాయ కార్యదర్శి కుమారస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేద్దాం

కౌతాళం: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేద్దామని ఆ సంఘం సీనియర్ నాయకుడు కృష్ణమూర్తి, ఎరిగేరి జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం రామేష్ నాయుడు అన్నారు. తమ సంఘం 1974 ఆగస్టు 10న ఆవిర్భవించిందని ఇప్పటికి 49 సంవత్సరాలు పూర్తి చేసుకొని 50వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా అక్టోబర్ 1న విజయవాడలో ప్రారంభమయ్యే స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంగళ వారం ఎరిగేరి ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టర్లను విడుదల చేశారు. యూటీఎఫ్ నాయకులు జీవిత, శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను పరిశీలించిన డీఈఓ


వెల్దుర్తిలో స్కూల్ కాంప్లెక్స్ ట్రైనింగ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి

వెల్దుర్తి: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను మంగళవారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి పరిశీలించారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి అనంతరం శిక్షణలో మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించే పద్ధతులను వివరించారు. అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే ఎఫ్‌ఏ-2 పరీక్షల నిర్వహణపై తగు సూచనలిచ్చారు. అనంతరం బాలుర హైస్కూల్, బాలికల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికల హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ.. బైజూస్ యాప్‌ను ఉపయోగించుకుని తర్ఫీదు పొందాలని సూచించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రామునాయక్, చంద్రావతి ఉన్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్


అలసందగుత్తిలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోనిరూరల్: అలసందగుత్తిలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చేసిన దాడుల నేపథ్యంలో పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గస్తీ నిర్వహిస్తున్నారు. మంగళవారం రెండోరోజు కూడా తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య ఆధ్వర్యంలో పికెట్ కొనసాగించారు. దీంతో గ్రామంలో ప్రశాంతత నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ నిఘా పెట్టామని, చట్టాలను ఎవరైనా అతిక్రమించినట్లయితే కఠిన చర్యలు తప్పవని తాలూకా సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

అక్రమ ఫీజు వసూళ్లపై ధర్నా

ఆదోని సెంట్రల్: జగనన్న విద్యాదీవెన సాయం అందక ముందే డిగ్రీ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులతో అక్రమ ఫీజులు వసులు చేయడం సరికాదని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బాలు అన్నారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అవరణలో మంగళవారం ఆర్‌పీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల చేత కట్టించుకున్న ఫీజులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రైవేట్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసులు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి నిబంధనలను ఉల్లంఘిస్తున్న కళాశాలలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో నాయకులు మాట్లాడి కట్టించుకున్న ఫీజులు తిరిగి చెల్లించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు వినోద్, హరికృష్ణ, విష్ణు, మహేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రం కోసిగికి చెందిన గ్యాలం రమేష్ అనే వ్యక్తి బైక్ నుంచి అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ వ్యక్తి ఆదోనికి వెళ్లి పని ముగించుకుని స్వగ్రామం కోసిగికి తిరిగి వస్తుండగా కోసిగి గ్రామ శివారులో నీటి గుంతను తప్పించబోయి అదుపు తప్పి కిందకి పడిపోయాడు. దీంతో ఆ వ్యక్తికి తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. తర్వాత అదే అంబులెన్స్‌లో మెరుగైన వైద్య కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ముమ్మరంగా ఫాగింగ్


కోసిగిలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ ఈఓ చంద్రశేఖర్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం గ్రామ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందితో కలిసి కోసిగి 1, 9వ వార్డులలో ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు అన్ని వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇంటి ముందు మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాజేష్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణ శివారు సాదాపురం గ్రామ సమీపంలో మంగళవారం ఆటోను వెనక నుంచి లారీ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. ఆదోని వైపు వస్తున్న ఆటోలో సాదాపురం గ్రామానికి చెందిన పద్మ, ములుగుందంకు చెందిన దస్తగిరమ్మ, విరుపాపురం గ్రామానికి చెందిన రాజు, నాగేంద్ర, కైరుప్పలకు చెందిన డ్రైవర్ మల్లప్ప ఉన్నారు. వెనక నుంచి లారీ ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ఐదుగురు గాయాలపాలయ్యారు. పద్మను మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

ఆదోనిఅర్బన్: యువతిని మోసగించి గర్భవతిని చేసిన కేసులో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. సోమవారం న్యూ మహాత్మాగాంధీ నగర్‌లో యువకుడు ఉరుకుంద ఇంటి ముందు ప్రియురాలు నాగవేణి దీక్ష చేపట్టిన విషయం విధితమే. తర్వాత ఆమె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఉరుకుందపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

నందవరం: మండల పరిధిలోని కోసిగి రోడ్డు వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మంగళవారం పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. సదరు వృద్ధుడు కొంతకాలంగా ఎమ్మిగనూరు టౌన్‌లోని కమిటీ జంక్షన్, శ్రీనివాస సర్కిల్ వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మంగళవారం ఉదయం ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్లే రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా తిక్కారెడ్డి పొలం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఇతడి ఆచూకీ తెలిసిన వారు 91211 01150, 94417 59770 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.